క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో హరితహారం



మొక్కలు నాటుతున్న క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్‌అర్బన్: హరితహారంలో భాగంగా సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతినిధులు జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ అనాధ శరణాలయంలో 30 పండ్ల మొక్కలు నాటారు. క్లబ్ అధ్యక్షుడు ఉబేద్‌బిన్ యాహియా మాట్లాడుతూ ఆశ్రమం పరిసర ప్రాంతాల్లో పూలమొక్కలు, ఆహ్లాదాన్ని పంచే ఇతర మొక్కలు నాటడం వలన విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారన్నారు. నాటిన మొక్కలను ఆశ్రమం నిర్వాహకులు సంరక్షించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పుల్లూరి శంకర్, సభ్యులు కోట వెంకన్న, రమణారెడ్డి, నాంపల్లి శంకర్, పోచయ్య, వెంకటేశ్వర్లు, సంజయ్‌కుమార్, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

దహెగాం: మండలంలోని చిన్న ఐనం గ్రామానికి చెందిన జంగిటి రవి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. రవి ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు సోమవారం సోదాలు చేయగా 2.50 క్వింటాళ్ల రేషన్ బియ్యం గుర్తించినట్లు తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకొని రవిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిడాం శంభు వర్ధంతి విజయవంతం చేయండి

నార్నూర్: తుడందెబ్బ వ్యవస్థాపకులు సిడాం శంభు వర్ధంతిని విజయవంతం చేయాలని ఆదివాసీ గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు కోరారు. సోమవారం గాదిగూడ మండలంలోని లోకారి(కె)లో మాట్లాడారు. ఈనెల 20న ఉట్నూర్ మండలంలోని మత్తడిగూడలో స్మరణ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. తుడందెబ్బ మండల గౌరవ అధ్యక్షుడు పూసం బాదిరావు, మండలాధ్యక్షుడు మాడవి చంద్రహారి, దేవురావు, మధు పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: సిడాం శంభు వర్ధంతిని విజయవంతం చేయాలని సిడాం శంభు తనయుడు సిడాం సోనేరావు, ఆదివాసీల సంఘాల నాయకులు పెందూర్ పుష్పరాణి, పుర్క బాపురావు పిలుపునిచ్చారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

రెబ్బెన: మండలంలోని బుద్దానగర్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కాగజ్‌నగర్ మండలంలోని బట్టుపల్లికి చెందిన పులుగం తిరుపతికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై భూమేశ్ తెలిపిన వివరాల ప్రకారం రెబ్బెన మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద గల జిన్నింగ్ మిల్లులో పని చేసే తిరుపతి రోజు మాదిరిగానే సోమవారం రాత్రి విధులకు హాజరయ్యేందుకు మోటర్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో బుద్దానగర్ సమీపంలో ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో తిరుపతి లారీని వెనుక భాగంలో ఢీకొట్టాడు. ప్రమాదంలో తిరుపతి ఎడమ చేతికి, తలకు తీవ్రగాయాలు కాగా 108 అంబులెన్స్‌లో కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్	
కుమురంభీం	: మహావీరుడు
కాగజ్‌నగర్	
వెంకటరమణ	: మహావీరుడు

\- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.120
సిమ్లామిర్చి	100
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	100
కాకరకాయ	80
బెండకాయ	80
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	120
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	100
క్యాబేజి	60

-ఆసిఫాబాద్‌అర్బన్

పాఠశాలల్లో పఠన గ్రంథాలు

- విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలు పెంపొందించేందుకు అడుగులు
- ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా పుస్తకాల పంపిణీ
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి



స్టేషన్‌రోడ్డు ఎంపీపీఎస్‌లో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు



సంజీవనగర్ ఎంపీపీఎస్ గ్రంథాలయంలోని పుస్తకాలు

పెంచికల్‌పేట్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రభుత్వం రూం టూ రీడ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల్లో చదివే అలవాటు పెంపొందించడానికి, విద్యార్థులు ఉత్తమ పాఠకులుగా ఎదగడానికి ప్రభుత్వం పాఠశాలలకు ఉచితంగా గ్రంథాలయ పుస్తకాలు పంపిణీ చేసింది. ఒకవైపు విద్యార్థులకు సిలబస్ బోధించడంతో పాటు ప్రతీరోజు గ్రంథాలయ పుస్తకాలు చదివేందుకు ప్రత్యేకంగా ఒక పీరియడ్ కేటాయించారు. దీంతో ఆయా పాఠశాలల్లో విద్యార్థులు కథల పుస్తకాలు చదవడానికి ఆసక్తి చూపుతున్నారు.

మండలంలో..

మండలంలో 31 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా వీటిలో మన ఊరు మన బడికి ఎంపికైన ఎంపీపీఎస్ చేడ్వాయి, పెంచికల్‌పేట్, ఎల్కపల్లి, సంజీవనగర్, ఎల్లూర్ పాఠశాలలకు అధికారులు గ్రంథాలయ పుస్తకాలు, డెస్కులు అందజేశారు. మరో వైపు 31 ప్రభుత్వ పాఠశాలలకు స్కేలింగ్ అప్ ఎర్లీ రీడింగ్ ఇంటర్‌వెన్షన్ (సెరీ) ఆధ్వర్యంలో 57 పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయా పాఠశాలలోని ఉపాధ్యాయులు నిత్యం ఒక పీరియడ్‌ను విద్యార్థులకు కేటాయించి పుస్తకాలు చదివేలా ప్రోత్సహిస్తున్నారు.

రంగురంగుల పుస్తకాలు..

ప్రభుత్వం, సెరీ ఆధ్వర్యంలో అనేక రకాల పుస్తకాలను పాఠశాలలకు అందజేశారు. తరగతి గదిలో డెస్కులపైన పుస్తకాలు ఏర్పాటు చేశారు. వివిధ రకాల పుస్తకాలను పంపిణీ చేయడంతో విద్యార్థులు పుస్తకాలను చదవడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రాథమికస్థాయి నుంచే విద్యార్థుల్లో పఠన ఆసక్తిని పెంపొందించడానికి వారి స్థాయికి తగిన పుస్తకాలను తరగతి గదిలో ఏర్పాటు చేశారు.

విద్యార్థుల్లో ఆసక్తి పెరిగింది

విద్యార్థుల్లో పఠన నైపుణ్యాలు పెంపొందించడానికి ప్రత్యేకంగా ఒక పీరియడ్ కేటాయించాం. ప్రభుత్వం, సెరీ అందించిన పుస్తకాలను ప్రతీరోజు విద్యార్థులకు అందిస్తున్నాం. కథల పుస్తకాలు చదవడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు.

\- ప్రియాంక, హెచ్‌ఎం, ఎంపీపీఎస్, సంజీవనగర్

కళాశాలకు రోడ్డు మంజూరు చేయాలని వినతి



ఎమ్మెల్యే సక్కుకు వినతిపత్రం అందజేస్తున్న యువకులు

ఆసిఫాబాద్‌అర్బన్: వాంకిడి మండలం బెండారా గ్రామంలోని మోడల్ డిగ్రీ కళాశాలకు రోడ్డు మంజూరు చేయాలని, కళాశాలలో మౌలిక వసతుల కోసం నిధులు మంజూరు చేయాలని సోమవారం యువజన సంఘం నాయకులు ఎమ్మెల్యే ఆత్రం సక్కును జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. యువజన సంఘాల నాయకుడు ఆవిడపు ప్రణయ్ మాట్లాడుతూ మోడల్ కళాశాల వరకు సరైన రోడ్డు సౌకర్యం లేనందున వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కళాశాలలో తాగునీటి వసతితో పాటు మైదానం, ప్రహరీ నిర్మాణం, ఇతర అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. పెండింగ్ పనులు పూర్తి చేసి హాస్టల్ భవనాన్ని ప్రారంభించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాగరాజు, ప్రశాంత్, తరుణ్ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా పారిశుధ్యం.. స్థానికుల తిప్పలు



పోచమ్మ ఆలయం సమీపంలో గుంతలో నీరు



పోలీస్‌స్టేషన్ సమీపంలో..

చింతలమానెపల్లి: మండలంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. రహదారికి ఇరుపక్కల, రోడ్లపై గుంతల కారణంగా నీరు నిలుస్తుండడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. డ్రెయినేజీలు లేని కారణంగా వాన నీరు రోడ్లపైనే నిలుస్తోంది. మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తా, పోచమ్మ గుడి సమీపంలో, ప్రధాన రహదారిపై నీరు నిలిచి ఉండడంతో ఇక్కట్లు తప్పడం లేదని మండలవాసులు వాపోతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈవో శ్రీధర్

బెజ్జూర్: రైతుబీమా కోసం మండలంలోని గబ్బాయి, సుష్మీర్, తలాయి గ్రామాల్లో కొత్తగా పట్టా పాస్‌బుక్, పోడు పట్టాలు అందిన రైతుల నుంచి సోమవారం ఏఈవో శ్రీధర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోని రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పట్టాదారు రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుల్లో మార్పులు, నామినీ మార్పుకునే అవకాశం కూడా ఉందన్నారు. కార్యక్రమంలో సుష్మీర్ సర్పంచ్ తోర్రెం శంకర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు సన్మానం



న్యాయవాదులను సన్మానిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్: అంతర్జాతీయ న్యాయదినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఎంఎం హెల్ప్‌లైన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు రాజీవ్‌రెడ్డి, జీవీఎస్ ప్రసాద్, ఉబేద్‌బిన్ యాహియాలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. హెల్ప్‌లైన్ చైర్మన్ ఎండీ అహ్మద్ మాట్లాడుతూ ప్రతీ సామాన్యుడికి న్యాయం జరిగేలా న్యాయవాదులు వృత్తిపరంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు అహ్మద్ బిన్ అబ్దుల్లా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నాంపెల్లి శంకర్, బుర్సా పోచయ్య, పుల్లూరి శంకర్, సంఘం ప్రతినిధులు నిసార్, షాహిద్, విజయ్‌కుమార్, సోజర్ పాల్గొన్నారు.

కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి



కౌటాలలో మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

తిర్యాణి: పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మెను నివారించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆరోపించారు. పంచాయతీ కార్మికులు చేపడుతున్న సమ్మె సోమవారం 12వ రోజుకు చేరుకోగా వారికి సంఘీభావంగా దీక్షలో కూర్చొని మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీసం రూ.19 వేలు ఇవ్వడంతో పాటు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి రంగు లచ్చగౌడ్, ఏఐటీయూసీ సింగం మొగిలిగౌడ్, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు సుద్దాల తిరుపతి తదితరులు ఉన్నారు.

పంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

కౌటాల: గ్రామ పంచాయతీ సిబ్బందిని ప్రభుత్వం వెంటనే క్రమబద్ధీకరించాలని సంఘం మండల అధ్యక్షుడు ప్రకాశ్ అన్నారు. కౌటాల ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం కొనసాగింది. సమ్మెలో భాగంగా కార్మికులు మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు కరుణాకర్, దేవాజీ, బ్రహ్మయ్య, పోచయ్య, బాపు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: తమ డిమాండ్ల సాధన కోసం సమ్మెబాట పట్టిన పంచాయతీ కార్మికులు సోమవారం మండల కేంద్రంలోని దీక్ష శిబిరంలో ఒంటి కాలిపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు ఉపేందర్, సుధాకర్, కార్మికులు దేవాజీ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకున్న జేఏసీ నాయకులు

కొండపల్లిలో ఏర్పాటు చేసిన తాత్కాలిక పంచాయతీ కార్మికులను సోమవారం పంచాయతీ కార్మికుల సంఘం జేఏసీ నాయకులు అడ్డుకున్నారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ తమ సమస్యల సాధన కోసం సమ్మె చేపడితే తాత్కాలిక కార్మికులను ఏర్పాటు చేసి తమ కడుపు కొట్టే ప్రయత్నం చేయటం సరికాదన్నారు.



రెబ్బెనలో..



తిర్యాణి: మాట్లాడుతున్న ఉపేందర్

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యే సక్కు

ఆసిఫాబాద్‌రూరల్: ఆపత్కాలంలో పేదలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌వోసీని అందజేశారు. ఆయన మాట్లాడుతూ చిలాటిగూడ గ్రామానికి చెందిన రవీందర్ వైద్య చికిత్స చేయించుకోలేని పరిస్థితుల్లో ఉండటంతో సీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షల ఎల్‌వోసీ మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, నాయకులు రవీందర్, వెంకన్న, భీమేశ్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ఆసిఫాబాద్: నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను సోమవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కెరమెరి మండలం సావర్‌ఖేడ గ్రామానికి చెందిన విమలాబాయికి రూ.26 వేలు, సుధాకర్‌కు రూ.24 వేలు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయంలో పూజలు

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్ శ్రీ భ్రమరాంభ మల్లికార్జునస్వామి, శ్రీ షిర్డీసాయిబాబా ఆలయాలను మాజీ ఫిలిం డెవలప్‌మెంట్ చైర్మన్ పుస్కూరి రామ్మోహన్‌రావు సోమవారం దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థ ప్రసాదాన్ని అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పంటలకు ప్రాణం..!



గురుడుపేటలో పత్తి పంట

- జిల్లా వ్యాప్తంగా మోస్తారు వర్షాలు
- పత్తి, కంది, సోయా పంటలు సాగు చేస్తున్న రైతులకు ఊరట
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

కౌటాల: జిల్లావ్యాప్తంగా వారం రోజుల నుంచి కురిసిన మోస్తారు వర్షాలతో పత్తి, సోయా, కంది పంటలు సాగు చేస్తున్న రైతులకు ఊరట లభించింది. ఈసారి ఖరీఫ్ ప్రారంభంలో వరణుడు కరుణించకపోవడంతో రైతులు సాగు పనులు ఆలస్యంగా ప్రారంభించారు. గత నెల చివరిలో మురిపించిన వరుణుడు గత కొద్ది రోజులుగా ముఖం చాటేయడంతో అనేక చోట్ల పత్తి విత్తనాలు మొలకెత్తలేదు. ఇటీవల కురిసిన వర్షంతో విత్తనాలు మొలకెత్తడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

4.51 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలోని 1.16 లక్షల మంది రైతులు జిల్లా వ్యాప్తంగా 4.51 లక్షల ఎకరాల్లో వానాకాలంలో పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా 3,35,178 ఎకరాల్లో పత్తి, 54,611 ఎకరాల్లో వరి, 46,096 ఎకరాల్లో కంది, 3017 ఎకరాల్లో పెసర, 1,524 ఎకరాల్లో సోయా సాగు చేయనున్నారు. ఈసారి మండుటెండల్లో పలువురు రైతులు పత్తి విత్తనాలు వేయగా రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో తొలకరి జల్లుల కోసం దాదాపు 15రోజుల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. అనంతరం చిరుజల్లులు కురవడంతో మండుటెండల్లో వేసిన పత్తి విత్తనాలు మొలకెత్తగా మళ్లీ పక్షం రోజులు వానలు కురవకపోవడంతో మొలకెత్తిన పత్తి మొక్కలను బతికించుకోవడానికి రైతులు ఆరాట పడ్డారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు జీవం పోశాయి.

మళ్లీ విత్తుకుంటున్నారు..

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దాదాపుగా అన్ని చేలల్లో పత్తి విత్తనాలు మొలకెత్తగా, పత్తి విత్తనాలు మొలకెత్తని చోట మళ్లీ విత్తనాలు విత్తుకుంటున్నారు. విత్తనాలు వేసిన తర్వాత 10 రోజుల పాటు వానలు కురవకపోవడంతో చాలా చేలల్లో వేసిన పత్తి విత్తనాలు కుళ్లిపోగా, పలు విత్తనాలను పురుగులు తిన్నాయి. దీంతో రైతులు మళ్లీ ఎకరానికి ఒక్కో ప్యాకెట్ చొప్పున పత్తి విత్తనాలు వేస్తున్నారు. దీంతో రైతులకు అదనంగా ఖర్చు పెరుగుతుంది.

పంటలకు జీవం..

ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురవలేదు. దీంతో ఈసారి మండుటెండల్లోనే 4 ఎకరాల్లో పత్తి విత్తనాలు వేశాను. తొలకరి చినుకులకు విత్తనాలు మొలకెత్తాయి. అనంతరం కొద్ది రోజుల పాటు వానలు కురవకపోవడంతో ఆందోళన చెందాను. ప్రస్తుతం మోస్తారు వర్షాలు పడడంతో పత్తి మొక్కలకు జీవం పోసినట్లయింది. వర్షం కురవడంతో వరి నారు పోశాను. విస్తారంగా వర్షాలు కురిస్తే వరి నాట్లు వేస్తాం.

\- శంకర్, నాగేపల్లి

ప్రభుత్వం సింగరేణి బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న సత్యనారాయణ

మందమర్రిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి సంస్థకు చెల్లించాల్సిన రూ.29వేల కోట్లు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏరియాలోని కేకే-5 గనిపై సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు చెల్లించకపోవడంతో, సంస్థ ఉద్యోగులకు వేతనాల చెల్లింపులో బ్యాంకుల చుట్టూ తిరిగి, అప్పులు చేసి, వేతనాలు చెల్లించాల్సి వస్తుందని ఆరోపించారు. గతేడాది సంస్థకు వచ్చిన లాభాల్లో వాటా 35శాతం, 11వ వేజ్‌బోర్డ్ వేజెస్, దీపావళి బోనస్, దసరా అడ్వాన్స్‌లు దసరాకు ముందే చెల్లించాలన్నారు. ఆయన వెంట ఆ యూనియన్ నాయకులు శ్రీనివాస్, రాజేశం, మల్లయ్య, తిరుపతి, సంపత్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బెల్లంపల్లి: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పంచాయతీ రాజ్ డీఈ స్వామిరెడ్డి సోమవారం పరిశీలించారు. మండలంలోని పెర్కపల్లి, దుగ్నెపల్లి, గురిజాల, ఆకెనపల్లి గ్రామాలకు మంజూరైన నూతన పంచాయతీ భవనాల నిర్మాణాల పనులను పరిశీలించి పనుల వివరాలను ఆరా తీశారు. దీంతో పాటు పెర్కపల్లిలో పల్లెప్రకృతి వనంను పరిశీలించి పలు సూచనలు చేశారు. పనులను నాణ్యతతో, త్వరితగతిన గడువులోగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు.

24 గంటల కరెంటు ఘనత బీఆర్‌ఎస్‌దే

- ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి: వ్యవసాయానికి 24గంటల ఉచిత విద్యుత్ ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అని మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. 24గంటల విద్యుత్‌పై పార్టీ శ్రేణులు ప్రజల వద్దకు వెళ్లాలన్న మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు, దండేపల్లి మండలం ముత్యంపేట రైతువేదిక వద్ద సోమవారం రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రైతులకు రేవంత్ క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో ఎంపీపీ శ్రీనివాస్, రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, వైస్‌ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ లింగన్న, స్థానిక సర్పంచ్ విఠల్, ఎంపీటీసీ రాజన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, వెంకటేష్, రైతుసమితి కో ఆర్డినేటర్లు, సభ్యులు, రైతులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

ఇంద్రవెల్లి: దుబ్బగూడ గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని శంకర్‌గూడ గ్రామస్తులు జిల్లా ఎంపీ సోయం బాపురావ్‌కు విన్నవించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఎంపీ సోయం బాపురావ్ నివాసానికి వెళ్లి గ్రామ సమస్యలను వివరించారు. తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నామని, గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మించాలని శంకర్‌గూడ గ్రామస్తులు విన్నవించగా.. మట్టి రోడ్, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ. 8 లక్షల నిధులు మంజూరు చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తుంరం లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాదయాత్ర విజయవంతం చేయండి

నెన్నెల: నెన్నెల, వేమనపల్లి మండలాల్లోని మారుమూల ప్రాంతాలైన కోణంపేట, బోగంపల్లి, దమ్మిరెడ్డిపేట, బొప్పారం, వేమనపల్లి చామనపల్లి, బద్ధంపల్లి, బొమ్మెన నాగారాం గ్రామాల నుంచి వంద మంది యువకులు, ప్రజలు మంగళవారం కలెక్టరేట్ వరకు పాక్షిక పాదయాత్ర చేపడుతున్నట్లు యువజన సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. విద్య, వైద్యం, రవాణా వసతుల గురించి కలెక్టర్‌కు సమస్యలను విన్నవించుకోనున్నట్లు తెలిపారు.

నిత్యావసర సరుకులు పంపిణీ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలో వోలపు విష్ణు అనే వ్యక్తి ప్రమాదవశాత్తు మృతి చెందగా సోమవారం మాలమహానాడు నాయకులు వారి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి 50కిలోల బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు.